వినాయక చవితి సందడి


ఆత్మకూరు: మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో కొనుగోలుదారుల సందడి


ఆత్మకూరు్‌లో ప్రతిమలు, గొడుగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు


ఉదయగిరిలో వినాయకుడి ప్రతిమను కొనుగోలుచేసి తీసుకెళ్తున్న యువత


కావలిలో మట్టి ప్రతిమలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో శుక్రవారం వినాయక చవితి సందడి నెలకొంది. వాడవాడల గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు యువత సిద్ధమై ఏర్పాట్లలో తలమునకలయ్యారు. మండపాలను సిద్ధం చేసి గణేశ్ విగ్రహాలను కొనుగోలు చేసి తరలిస్తూ కనిపించారు. మరోవైపు కావలి, ఆత్మకూరులోని మెయిన్ రోడ్లు గణపతి బొమ్మలు, పూజాసామగ్రి విక్రయ, కొనుగోలుదారులతో సందడిగా మారాయి.

–కావలి/ఆత్మకూరు/ఉదయగిరి


కావలిలో పత్రి కొనుగోలు చేస్తున్న మహిళ

క్లుప్తంగా

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

కొండాపురం: మండలంలోని సత్యవోలు చెరువును కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని లింగన్నపాళెం గ్రామస్తులు తహసీల్దార్ సుందరమ్మకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మందపల్లి మాధవరావు, దాసరి వెంగళరావు మాట్లాడుతూ చెరువు ఎగువ భాగంలో ఆరెకరాలను సత్యవోలు గ్రామస్తులు ఆక్రమించి పత్తి, నువ్వు, తదితర పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. లింగన్నపాళెంలో సర్వే నంబరు 275–4లో అనాధీనంగా ఉన్న 18 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన పేదలు సాగు చేసుకుంటుండగా గత తహసీల్దార్ శ్రీనివాసులు, ప్రస్తుత వీఆర్వో పోలయ్య కలిసి నగదు పుచ్చుకుని కావలికి చెందిన కొందరు వ్యక్తుల పేర్లపై ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



అనుమసముద్రంపేట: మండల నూతన ఎస్సై సైదులును ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, ఏఎస్‌పేట సర్పంచ్ కుడారి హజరత్తమ్మ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం



సంగం: మండల వెలుగు కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఎంతఓలు జానకీరాం, మల్లయ్య శుక్రవారం శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ



సోమశిల: అనంత సాగరం మండలం పాతదేవరాయపల్లిలోని పోలేరమ్మ, తుమ్మాలమ్మ ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయాల్లోని హుండీలను దూరంగా తీసుకెళ్లి పగులగొట్టి అందులోని నగదును అపహరించారు. రూ.10వేల విలువైన యాంప్లిఫయర్‌ను తీసుకెళ్లి బయటపడేయడంతో వర్షానికి తడిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామదేవతల ఆలయాల్లో మూడు నెలల క్రితం దొంగలు చోరీకి పాల్పడ్డారని, పోలీసులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. తుమ్మాలమ్మ ఆలయంలోని సీసీకెమెరా ఫుటేజీ ఆధారంగా దొంగలను పట్టుకుని చోరీలను కట్టడి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీహెచ్‌ఎన్‌కు పదోన్నతి



వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్‌ఎన్)గా పని చేస్తున్న ఎం సుశీలమ్మకు కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ వైఎస్సార్ జిల్లా కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. ఆమె త్వరలో ఇక్కడి నుంచి రిలీవ్ కానుంది. ఐదేళ్లుగా ఆమె వైద్యారోగ్య సేవలు ప్రజలకు అందిస్తూ ఉన్నతాధికారులు, ప్రజల మన్ననలు పొందారు. ఆమెకు పదోన్నతి లభించడం పట్ల సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు.


మాజీ ఎంపీపీ మృతి

సోమశిల : అనంతసాగరం మండల మాజీ ఎంపీపీ మునగపాటి వెంకటసుబ్బరాజు అనారోగ్యంతో చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. స్వగ్రామమైన చిలకలమర్రిలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మునగపాటి భౌతికకాయాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

అనుమసముద్రంపేట: గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏఎస్‌పేట ఎస్సై సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఉత్సవాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అన్నారు. రోడ్లపై విగ్రహాలు, డీజేలు ఏర్పాటు చేసి ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



సీతారామపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయుడు పిచ్చయ్య తరపున హెచ్‌ఎం శ్రీనివాసులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. షేక్ ఖలీల్‌అహ్మద్‌కు రూ.3వేలు, వెంకటచరణ్‌కు రూ.2,500, గురువంశీకు రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఉపాధ్యాయులు డీవీవీ ప్రసాద్, వెంగయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో సమస్యలు తిష్ట

- సెలవుపై వెళ్లిన ఎస్టేట్ అధికారిణి
- అప్పట్నుంచి ఇన్‌చార్జిని నియమించని మార్కెటింగ్ శాఖ
- పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా పారిశుధ్యం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, కొనుగోలుదారులు



రైతుబజారులో ప్రవేశమార్గం వద్ద పేరుకుపోయిన కూరగాయల వ్యర్థాలు

కావలి: కావలి రైతుబజార్‌లో సమస్యలు తిష్ట వేశాయి. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ సెలవుపై వెళ్లారు. అప్పట్నుంచి పారిశుద్ధ్య నిర్వహణను పట్టించుకునే దిక్కులేక ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి దర్శనమిస్తోంది. కనీసం మరుగుదొడ్లను సైతం శుభ్రపరిచే దిక్కులేక దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులుపడుతున్నారు. కావలి రైతు బజార్‌లో 105 దుకాణాలు ఉన్నాయి. ప్రతి నెలా ఒక్కో దుకాణం నుంచి రూ.2,500 వంతున మార్కెటింగ్ శాఖ అధికారులు అద్దె వసూలు చేస్తున్నారు. వీటితో పాటు ఖాళీ స్థలంలో మరో 20 మంది రైతులు తాము పండించిన కూరగాయాలు, ఆకుకూరలను రొటేషన్ పద్ధతిలో ఉచితంగా విక్రయించుకునేందుకు అవకాశం కల్పించారు. పట్టణంలో సుమారు 2.5 లక్షల మంది జనాభా ఉన్నారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలు, చిరువ్యాపారులు, రైతులకు పట్టణ నడిబొడ్డున ఉన్న రైతుబజార్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఇక్కడికి నిత్యం వేలాది మంది కూరగాయల కొనుగోలు, విక్రయాల నిమిత్తం వస్తుంటారు. రైతుబజార్‌లో పారిశుధ్యం లోపించి పరిసరాలు దుర్గంధం వెదజల్లుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్టేట్ ఆఫీసర్ సెలవుపై వెళ్లడంతో..

రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖకు చెందిన ఎస్టేట్ ఆఫీసర్ పర్యవేక్షిస్తుంటారు. వ్యాపారులు, కొనుగోలుదారులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తూ సమస్యలు తలెత్తకుండా చూస్తుంటారు. అయితే కావలి రైతుబజార్ ఎస్టేట్ అధికారిణి వ్యక్తిగత కారణాలతో నెలన్నర క్రితం సెలవుపై వెళ్లారు. అప్పట్నుంచి మార్కెటింగ్ శాఖ మరొకరిని ఇన్‌చార్జిగా నియమించలేదు. దీంతో రైతుబజార్‌లో సమస్యలు తిష్టవేసి అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిన సమయంలో రైతుబజార్ ప్రాంగణంలో నిల్వ చేరిన నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకునే వారు లేకుండాపోయారు. అలాగే రైతుబజార్‌లోని మరుదొడ్లను శుభ్రపరిచే వారు లేక అధ్వానంగా తయారయ్యాయి. రైతుబజార్‌లోని వ్యర్థాలను మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుని తరలించే వారే కరువయ్యారు. దీంతో కూరగాయల వ్యర్థాలు కుళ్లిపోయి పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ముక్కులు మూసుకుని తమ పనులు చక్కబెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.


కొనుగోలుదారులు వెళ్లేందుకు దారి లేకుండా అడ్డదిడ్డంగా ట్రేలు ఏర్పాటు చేసిన వ్యాపారులు

ప్రతిపాదనలు పంపాం

కావలి రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. రైతుబజారును పర్యవేక్షించే వారు లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎస్టేట్ అధికారిగా మరొకరిని నియమించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు అందగానే కొత్తవారిని నియమిస్తాం.

–పీ అనిత, ఏడీ, మార్కెటింగ్ శాఖ, నెల్లూరు

ప్రతిరోజూ లక్ష మందికి పనుల కల్పనే లక్ష్యం


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సంగం: జిల్లాలో ప్రతిరోజూ లక్ష మందికి ఉపాధి పనులు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సంగంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న కాలువ పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. కూలీలను అడిగి చేస్తున్న పని వివరాలు..ఎన్ని రోజుల నుంచి పనికి వస్తున్నారు..కూలి గిట్టుబాటు అవుతుందా.. పనికి వచ్చిన అందరికి పనులు కల్పిస్తున్నారా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు కూలి రూ.300 అందుకునేలా పనిచేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో ప్రతిరోజూ 60 వేల మంది పనులకు వస్తున్నారని తెలిపారు. ఈ సంఖ్యను లక్షకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుని ఉపాధి పనులు గుర్తించి కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలకు అవసరమైన పనులు ఏమైనా ఉంటే గుర్తించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

మేజర్ పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సంగంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ జనరల్ ఫండ్స్ 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకుని కేంద్రాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలని ఆదేశించారు. చికెన్ వ్యర్థాలను దూరంగా భూమిలో పాతిపెట్టేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీపీఓ సుస్మిత, డ్వామా పీడీ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్, ఎంపీడీఓ అప్పాజీ, తహసీల్దార్ సోమ్లానాయక, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తగలబడిందా.. తగల బెట్టారా?

అనుమసముద్రంపేట: గండువారిపల్లిలోని రజియాబేగం ఇంట్లో శుక్రవారం వేకువన అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ నెల 3న అర్ధరాత్రి రజియాబేగం, షాజహాన్ దంపతులు మరికొందరితో కలిసి వారి ఇంట్లో గుంత తవ్వి పసుపు, కుంకుమ వేసి పూజలు చేస్తుండగా గ్రామస్తులు గమనించారు. క్షుద్ర పూజలు చేస్తున్నారనే అనుమానంతో పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ క్రమంలో కొందరు పరారవగా పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ నేపథ్యంలో రజియా బేగం ఇంట్లో వేకువన అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అయితే ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందా లేక ఎవరైనా నిప్పు పెట్టారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

చుంచులూరువాసికి పురస్కారం

మర్రిపాడు: మండలంలోని చుంచులూరుకు చెందిన సినీ నేపథ్య గాయకుడు విఠల్ కుమార్‌కు భారత్ వికాస్ పరిషత్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన సినిమాల్లో నేపథ్య గాయకుడిగా కొనసాగుతూనే హైదరాబాద్‌లో సంగీత శిక్షణ సంస్థను స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు సంగీత జ్ఞానాన్ని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురుపూజోత్సవం సందర్భంగా విఠల్‌ను భారత్ వికాస్ పరిషత్ సన్మానించి పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా విఠల్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

ఉదయగిరి: దేశ వ్యాప్తంగా ఈ నెల 14న నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌ను ఉదయగిరి సర్కిల్ పరిధిలోని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి సీఐ ఎన్ వెంకట్రావు కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఎస్సై ఇంద్రసేనారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం అందించడం జరుగుతుందన్నారు. సర్కిల్ పరిధిలో 500 కేసులు ఉండగా వీటిలో 200 కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు కోర్టులు చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీపడి వస్తే పైసా ఖర్చు లేకుండా కేసులను రాజీచేస్తామని తెలిపారు.

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి

వినాయక చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరని సీఐ తెలిపారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో ఉత్సవాల అనుమతుల కోసం 74 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సింగిల్‌విండో విధానం ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నామని, ఉత్సవాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని కోరారు. పోలీసులు సూచించిన నిబంధనలను పాటిస్తూ ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆఫ్రాన్ పనులను వేగవంతం చేయాలి


ఆఫ్రాన్ పనులను పరిశీలిస్తున్న రైతు సంఘాల నాయకులు

సోమశిల: సోమశిల ప్రాజెక్ట్ వద్ద జరుగుతున్న ఆఫ్రాన్ పనులను జిల్లా రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణరెడ్డి ప్రాజెక్ట్ వద్దకు వచ్చి సమీక్షించిన ఆశించిన స్థాయిలో పనులు వేగవంతంగా జరగడం లేదన్నారు. డెల్టాకు నీరు వదిలే డైవర్షన్ వాల్ పూర్తిగా దెబ్బతిని ఉన్నా దానిని ఇప్పటి వరకు నిర్మించలేదన్నారు. జిల్లా రైతాంగం, ప్రజల భవిష్యత్ సోమశిల జలాశయం మీద ఆధారపడి ఉందని, పనులు నాణ్యతగా చేయాలన్నారు. 11వ నంబర్ గేటు దెబ్బతిని ఉందని దానికి మరమ్మతులు చేపట్టాలన్నారు. జలాశయంలో 41 టీఎంసీల నీరు చేరిందని, వర్షాకాలంలో లోగా పనులు పూర్తికాకపోతే వరద వస్తే పెన్నా పరివాహక ప్రాంతాలు, నెల్లూరు నగరం మరో విజయవాడగా మారుతాయన్నారు. అందువల్ల త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. జిల్లా రైతు సంఘం మాజీ కార్యదర్శి చంద్రా రాజగోపాల్, జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమ్మరాజు, మంగలపుల్లయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గంటా లక్ష్మీపతి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముత్యాల గురునాధం, తాళ్లూరు గోపాల్, పాట్టేపాళెం చంద్రమౌళి, సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి

దుత్తలూరు: నర్రవాడ పంచాయతీ పరిధిలోని గుడేవారిపాళెంలో పాడిరైతు పచ్చవ శ్రీధర్‌కు చెందిన రెండు రెండు గేదెలు శుక్రవారం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాయి. పశువైద్యశాల సమీపంలో మేత మేస్తూ తెగిపడిన తీగలను తగలడంతో షాక్‌కు గురై గేదెలు మృతి చెందాయి. గేదెల విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని, విద్యుత్ అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితుడు వేడుకున్నాడు.

లార్వా సర్వే

సంగం: పెరమనలో డెంగీ కేసు నమోదు కావడంతో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం లార్వా సర్వే చేపట్టారు. నీటి నిల్వలను తొలగించి దోమల నివారణ మందు పిచికారీ చేశారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ గ్రామాన్ని సందర్శించి డెంగీతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖాదర్ బాషా, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు



ఆత్మకూరు: వినాయక చవితిని పురస్కరించుకుని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. విఘ్నేశ్వరుడి ఆశీర్వాదంతో సమస్త విఘ్నాలు తొలగిపోయి కోరుకున్న కోరికలు నెరవేరి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షించారు.

వరద బాధితులకు నగదు విరాళం

ఆత్మకూరు: విజయవాడ వరద బాధితులకు మున్సిపల్ పరిధిలోని పొదుపు మహిళలు తమ వంతు సాయంగా రూ.72,500 నగదు విరాళాన్ని శుక్రవారం అందజేశారు.సీఎంఎం అంకయ్య, సీఓ మాధవి ద్వారా సీఎం సహాయ నిధికి నగదును పంపారు. ఈ కార్యక్రమంలో పొదుపు ఆర్పీలు పాల్గొన్నారు.

హైవే బాధితులకు న్యాయం చేస్తాం



దుత్తలూరు: కావలి–ఉదయగిరి జాతీయ రహదారి నిర్మాణంలో ఆస్తులను కోల్పోయిన ప్రతిఒక్కరికీ పరిహారం అందేలా కృషిచేస్తామని తహసీల్దార్ వై నాగరాజు తెలిపారు. దుత్తలూరులో హైవే నిర్మాణంలో కోల్పోతున్న ఇళ్లను హైవే, రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హైవేకు సేకరించే స్థలాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఎవరికైనా పరిహారం అందకపోతే వారి వివరాలను కావలి ఆర్డీఓకు నివేదించి అందించేందుకు కృషిచేస్తామన్నారు.

మోటార్ సైకిళ్ల ఢీ–నలుగురికి గాయాలు


చికిత్స పొందుతున్న నరసింహులు

ఉదయగిరి: బండగానిపల్లి ఘాట్ రోడ్డులోని ఓ మలుపు వద్ద శుక్రవారం రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. వివరాలు.. జీ చెర్లోపల్లికి చెందిన కేశవులు, ఓబుల్‌ప్రసాద్ ఉదయగిరి నుంచి స్వగ్రామానికి మోటార్‌సైకిల్‌పై వెళుతున్నారు. అలాగే లింగమనేనిపల్లికి చెందిన మెడబలిమి నరసింహులు, సాదా శ్రీనివాసులు ఉదయగిరికి మోటార్‌సైకిల్‌పై ప్రయాణమయ్యారు. ఘాట్‌రోడ్డులోని ఓ మలుపు వద్ద ప్రమాదవశాత్తు రెండు మోటార్‌సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కేశవులు, నరసింహులు తీవ్రంగా గాయపడగా, శ్రీనివాసులు, ఓబులప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కేశవులును మెరుగైన చికిత్స నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో వినాయక చవితి వేడుకలు



అల్లూరు: వినాయకుడి వేషధారణలో విద్యార్థులు


కావలి: వినాయకుడికి పూజలు చేస్తున్న విద్యార్థులు

కావలి : గౌరవరంలోని ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్లో ముందస్తుగా వినాయక చవితి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు మట్టితో వినాయకుడిని చేసి పూజలు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలతో మహా నైవేద్యం సమర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అలరించారు.ఆర్‌ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ ఆదిలక్ష్మి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

అల్లూరు: నార్త్‌మోపూరులోని శ్రీచైతన్య హైస్కూల్లో ముందస్తుగా వినాయక చవితి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు మట్టిగణపతికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టారు. విద్యార్థులు వినాయకుడి వేషధారణలో అలరించారు. కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారంతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లికార్జున

ఆత్మకూరురూరల్: వెన్నవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ బలోపేతానికి కృషి చేస్తామని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లికార్జున పేర్కొన్నారు. వెన్నవాడ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 71 ఏళ్ల క్రితం ప్రారంభమైన వెన్నవాడ సొసైటీ రైతుల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. కాలానుగుణంగా వచ్చిన మార్పులతో కంప్యూటరీకరణ ప్రారంభించామని, ప్రతి సభ్యుడు తమ ఆధార్, భూమి వివరాలు, ఫోన్ నంబరును సహకార సంఘంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే సభ్యత్వం నుంచి తొలగిస్తామన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు వెన్నవాడలో గోదామును త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఎస్‌డీఎల్‌సీఓ సుధాకర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఫాతిమా, ఆత్మకూరు బ్రాంచ్ మేనేజరు శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు జనార్దన్‌రెడ్డి, సీఈఓ సురేష్, రైతు నాయకులు పాల్గొన్నారు.